కష్టం కుళ్లింది.. నష్టం మిగిలింది





జూపాడుబంగ్లా మండలం బన్నూరుకు చెందిన రైతు మనోహర్ రెండెకరాల్లో మొక్కజొన్న వేశారు. దిగుబడులు కోసి రహదారిపై ఆరబెట్టారు. ఈ క్రమంలో ఇటీవల కురిసిన వర్షాలకు దిగుబడులు మొత్తం తడిసిపోయి మొలకెత్తి కుళ్లిపోతున్నాయి. చేతికొచ్చిన పంట మొత్తం పూర్తిగా దెబ్బతిందని రైతు కన్నీటిపర్యంతమయ్యారు. – ఈనాడు, కర్నూలు

విస్తరణం



కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి విస్తరణ పనులు సాగుతున్నాయి. పాములపాడు మండలం కృష్ణారావుపేట వద్ద రహదారికి ఇరువైపులా ఉన్న భవనాలను కూల్చేస్తున్నారు. పరిధి దాటి కూలగొడుతున్నారంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. – ఈనాడు, కర్నూలు

సాగు బడిలో డ్రోనాచార్యులు

■ సేద్యానికి సాంకేతిక ఊతం




డ్రోన్ చేతిలో ఉంటే.. ఎకరం పొలంలో ఎనిమిది నిమిషాల్లో 'విత్తు'కోవచ్చు... ఐదు నిమిషాల్లో పురుగు మందు పిచికారీ చేయొచ్చు.. చేనుకు వ్యాపించి చీడపీడల చిత్రాలు తీసి క్షణాల్లో సలహాలు పొందొచ్చు.. నిత్యం పది ఎకరాల పొలంలో పురుగు మందులు పిచికారీ చేసి రూ.ఐదు వేల వరకు సంపాదించొచ్చు.!! ఇప్పటికే పలువురు యువకులు డ్రోనాస్త్రంతో ఉపాధి పొందుతున్నారు. 'కూటమి' ప్రభుత్వం తాజాగా తీసుకొన్న నిర్ణయాలతో మరింత మంది స్వయం ఉపాధి పొందడానికి మార్గం సుగమమైంది. 10 లక్షల హెక్టార్లలో 7.31 లక్షల మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్న ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగుకు ఊతం ఇవ్వనుంది.

కర్నూలు వ్యవసాయం, న్యూస్‌టుడే

డ్రోన్ల వినియోగంపై సర్కారు దృష్టి

ఓర్వకల్లులో ప్రత్యేక హబ్

'కూటమి' ప్రభుత్వం సాంకేతిక రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఫొటోగ్రఫీ, వ్యవసాయం, నిర్మాణ, రవాణా, విపత్తుల నిర్వహణలో డ్రోన్ల సేవలు విస్తృతమవుతున్న నేపథ్యంలో స్థానిక యువతకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. వీటిపై ఆసక్తి ఉన్న ఔత్సాహికులు, స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తోంది. డ్రోన్ల వినియోగం పెంచేందుకు అడుగులేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌ను డ్రోన్ ఇన్నోవేషన్ కేంద్రంగా, అమరావతిని డ్రోన్ సిటీ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. డ్రోన్ హబ్ అభివృద్ధి కోసం ఓర్వకల్లులో 300 ఎకరాలు కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.



15 రోజులు ప్రత్యేక శిక్షణ

విక్రయసంస్థలు 15 రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. వ్యవసాయ శాఖ గుంటూరులోని లాంఫామ్‌లో శిక్షణ ఇచ్చి ధ్రువీకరణ పత్రం అందజేస్తోంది. ఇటీవల ప్రైవేటు శిక్షణా కేంద్రాలూ వెలిశాయి.

యువతకు ఉపాధి

వినియోగంపై 15 రోజులపాటు శిక్షణ పొంది డ్రోన్ కొనుగోలు చేస్తే పంటల సీజన్‌లో సొంత గ్రామంలో ఉండి రోజుకు రూ.వేలు సంపాదించొచ్చు. పంట పొలాలకు పురుగు మందు పిచికారీ చేసేందుకు ఎకరాకు రూ.500 చొప్పున ఒక రోజులో 10 ఎకరాలు పిచికారీ చేస్తే రూ.5 వేలు సంపాదించొచ్చు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం వంద మంది వరకు ఇలా ఉపాధి పొందుతున్నారు. జి.సింగవరంలో రాఘవేంద్ర గౌడ్ ప్రస్తుత సీజన్‌లో 1,800 ఎకరాల్లో పురుగు మందులను పిచికారీ చేసి రూ.9 లక్షల ఆదాయం పొందారు.

డ్రోన్ సామర్థ్యాన్ని బట్టి గరిష్ఠంగా నిత్యం 75–100 ఎకరాల్లో మందులు పిచికారీ చేయొచ్చు. క్రిమిసంహారక మందు మొక్క అడుగు నుంచి పైవరకు తడుస్తుంది. ఎకరా పొలంలో 5–10 నిమిషాల్లోనే పూర్తవుతుంది.

సాధారణ స్ప్రేయర్లతో ఎకరా పొలంలో పురుగు మందుల పిచికారీకి 5–6 గంటల సమయం పడుతుంది. కూలీలైతే ఇద్దరికి రూ.500 నుంచి రూ.800 వరకు చెల్లించాల్సి వస్తుంది. డ్రోన్ల ఆపరేటర్లు రూ.450–500కు సేవలందిస్తున్నారు.

స్ప్రేయర్లతో ఎకరాకు 200 లీటర్ల నీరు అవసరమైతే.. డ్రోన్‌తో 10 లీటర్లు సరిపోతుంది.

విత్తుకోవచ్చు

డ్రోన్ సాయంతో విత్తనాలు విత్తుకోవచ్చు.. ఇందులో ఉంటే కంటెయినర్ (డబ్బా) పది లీటర్లు/ పది కిలోల బరువు మోస్తుంది. డబ్బాలో విత్తనాలు నింపి చల్లొచ్చు.. 2 కి.మీ. వరకు ప్రయాణిస్తుంది. సుమారు 265 అడుగుల ఎత్తు ఎగురుతుంది. ఎకరా భూమికి సరిపడా విత్తనాలు ఎనిమిది నిమిషాల వ్యవధిలో చల్లుతుంది.

ఖరీదు రూ.6 -రూ.10 లక్షలు

ఒక డ్రోన్ రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. డ్రోన్‌కు ఉపయోగించే బ్యాటరీ ఒక్కొక్కటి రూ.40 వేలు ఉంటుంది. నాలుగైదు బ్యాటరీలు కొనుగోలు చేసి వినియోగిస్తే 10-20 ఎకరాల పంటను పిచికారీ చేసేందుకు వీలవుతుంది. పంట పొలాల వద్ద బ్యాటరీలను ఛార్జింగ్ చేసుకునేందుకు వీలులేకపోవడంతో రూ.30 వేలు వెచ్చించి జనరేటర్ తీసుకోవాల్సి ఉంటుంది.

రాయితీ ఇస్తారు

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై), సబ్ మిషన్ ఆఫ్ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్‌ఎంఏఎం) పథకాల ద్వారా 40 శాతం ఇస్తున్నారు. పది లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్ల వ్యయం సుమారు రూ.10 లక్షలు కాగా కేంద్రం రూ.4 లక్షల రాయితీ, బ్యాంకులు రూ.5 లక్షలు రుణంగా ఇస్తున్నాయి. పది శాతం రైతు సంఘాలు, లేదా స్వయం సహాయక సంఘాలు భరించాల్సి ఉంటుంది.

మహిళలకు దీదీ పథకం

నమో డ్రోన్ దీదీ పథకంలో భాగంగా కేంద్రం ఉచితంగా డ్రోన్లు అందజేస్తోంది. కర్నూలు జిల్లాలో తొమ్మిది పొదుపు సంఘాల మహిళలకు దిల్లీ, హైదరాబాదులో శిక్షణ ఇచ్చారు. తొమ్మిది మంది మహిళలకు రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్లను ఉచితంగా పంపిణీ చేశారు.

ఉపాధి దొరికింది



పురుగుమందు పిచికారీ చేస్తూ

"నాలుగేళ్ల కిందట రూ.6 లక్షలు వెచ్చించి తిరుపతిలో డ్రోన్ కొనుగోలు చేశా... అప్పటి నుంచి డ్రోన్ సాయంతోనే పొలాల్లో పురుగు మందులు పిచికారీ చేస్తున్నా.. దీనికి 10 లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకు ఉంది.. ఎకరా పొలంలో పురుగుమందు చల్లేందుకు రూ.400 నుంచి రూ.500 వరకు తీసుకుంటున్నా.. పదో తరగతి చదివిన నాకు డ్రోన్ ఉపాధి ఇచ్చిందని" నందికొట్కూరు మండలం 10-బొల్లవరానికి చెందిన వివేకానందరెడ్డి అంటున్నారు. –నందికొట్కూరు, న్యూస్‌టుడే:

యూట్యూబ్‌లో చూసి



డ్రోన్‌తో రమేశ్

" నేను ఎంబీఏ పూర్తి చేశా.. మూడేళ్ల కిందట రూ.6 లక్షలు వెచ్చించి నెల్లూరులో డ్రోన్ కొనుగోలు చేశా. యూట్యూబ్‌లో చూసి నేర్చుకున్నా.. డ్రోన్‌తో పురుగు మందులు పిచికారీ చేసేందుకు ఎకరాకు రూ.500 తీసుకుంటున్నా.. ఒక గంటలో ఎకరా పొలంలో చల్లడానికి వీలుంది.. కూలీల ఖర్చు తగ్గడంతో రైతులు ఆదరిస్తున్నారని" ఆళ్లగడ్డ మండలం నందిపల్లెకు చెందిన రమేశ్ పేర్కొన్నారు.

–ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే:

మొదటి వ్యక్తిని నేనే



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న నజీర్

"మాది శిరివెళ్ల.. ఇంటర్మీడియట్ చదివాను.. రూ.6 లక్షలు వెచ్చించి 2020లో డ్రోన్ కొనుగోలు చేశా. దీని నిర్వహణపై పుణెలో వారం రోజులు శిక్షణ తీసుకున్నా.. మొదట్లో నిత్యం 20 నుంచి 30 ఎకరాల్లో పంటలకు మందులు పిచికారీ చేసేవాడిని.. నెలకు రూ.లక్షల వరకు ఆదాయం వచ్చేది. ఇక్కడ పని లేకపోతే కర్ణాటక, గోవా ప్రాంతాలకు వెళ్లి మందులు పిచికారీ చేసేవాడిని. జిల్లాలో డ్రోన్ వాడిని మొదటి వ్యక్తిని నేనే. ఎకరం పొలాన్ని ఐదు నిమిషాల్లో పూర్తి చేయొచ్చు.. ప్రస్తుతం వీటి సంఖ్య పెరగడంతో ఎకరానికి రూ.400 అద్దె తీసుకుంటున్నా... వీటికి మరమ్మతులు కూడా చేస్తుంటానని" నజీర్ పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, పాణ్యం

ఆనంద క్షణాల్లో విషాద గీతం

■ బంధువుల వివాహ రిసెప్షన్‌కు వెళ్తూ మృత్యు ఒడికి
■ కారును ఢీకొట్టిన ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు
■ ముగ్గురు మృతి.. నలుగురికి గాయాలు



సుచిత్ర (పాత చిత్రం)



వాసవి, ప్రేమ్‌కుమార్ దంపతులు (పాతచిత్రం)

పెళ్లి జరిగి రెండు రోజులు గడిచింది. ఆనందం నిండిన ఆ ఇంట విషాదం ఆవహించింది. మేళతాళాలు మోగిన ముంగిట ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి. కుమార్తె అత్తవారింట వేడుకకు సంతోషంగా మొదలైన ప్రయాణం. . అర్ధాంతరంగా ముగిసింది. రహదారి ప్రమాదం మూడు ప్రాణాలను చిదిమేసింది. రెండు కుటుంబాలను కన్నీటిపాలుచేసింది. మరణంలోనూ ఆ దంపతుల బంధం వీడలేదు. కలిసి జీవించిన వారు.. కలిసే కన్నుమూశారు. ఆనంద వేడుక.. విషాదంగా మారింది. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా.. మరో నలుగురు క్షతగాత్రులుగా మారారు.

– న్యూస్‌టుడే, కర్నూలు నేరవార్తలు:

కర్నూలు నగరంలోని షరాఫ్ బజార్‌కు చెందిన బంగారం వ్యాపారి, ఉడ్‌లాండ్స్ లాడ్జీ యజమాని కామిశెట్టి గురవయ్య ఇంట విషాదం నెలకొంది. ఆర్యవైశ్యులందరికీ సుపరిచితుడైన గురవయ్యకు ముగ్గురు కుమారులు రాజేష్, మహేష్, జగదీష్ ఉన్నారు. రాజేష్ కుమార్తె సిరిచందన (న్యాయవాది)కు తిరుపతికి చెందిన రోహిత్‌తో ఈ నెల 20న కర్నూలులో వివాహం జరిగింది. 24వ తేదీన తిరుపతిలో రిసెప్షన్ నిర్వహించనున్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి వాహనాల్లో బుధవారం కర్నూలు నుంచి బయల్దేరారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు వద్ద మైసూరివారిపల్లె సమీపంలో తిరుపతి నుంచి కడప వైపు ఎదురుగా వస్తున్న ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో నవ వధువుకు పిన్ని వరస అయిన సుచిత్ర(49), వారి బంధువులు కళాక్షేత్ర సిల్క్‌హౌస్ యజమాని ప్రేమ్(55), ఆయన భార్య వాసవి(45)ని తిరుపతిలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. నలుగురు చికిత్స పొందుతున్నారు.

ప్రయాణ వెతలు వినిపించండి

■ 25న డయల్ యువర్ డీఎం

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు పరిష్కరించి, సౌకర్యాలు మెరుగుపరిచే లక్ష్యంతో ఈనెల 25న 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నంద్యాల డిపో మేనేజరు గంగాధరరావు తెలిపారు. ప్రయాణికులు శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య 9959225800 నంబరుకు ఫోన్ చేసి తమ సూచనలు, సలహాలు, ఫిర్యాదులను తెలియజేయాలని కోరారు. నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే :



మల్లన్నకు స్వర్ణ రథోత్సవం

శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్ల స్వర్ణ రథోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని వేకువజామున మల్లికార్జునస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 7.30 గంటలకు స్వర్ణ రథాన్ని ముస్తాబు చేసి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. మంగళ హారతులతో పూజలు చేశారు. కళాకారుల నృత్య సందడి, భక్తుల శివనామ స్మరణల మధ్య ఆలయ మాడ వీధుల్లో స్వర్ణ రథోత్సవం నేత్రశోభితంగా జరిగింది. ఇన్‌ఛార్జి ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే :


శ్రీశైలం జలాశయం గేట్ల మూసివేత

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో బుధవారం శ్రీశైలం జలాశయం గేట్లను మూసివేశారు. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,42,518 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. కుడి, ఎడమ గట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 65,568 క్యూసెక్కుల వరద నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 884.50 అడుగులు, నీటినిల్వ 212.9198 టీఎంసీలుగా నమోదైంది.

ఊరి బడికి ఊరట

■ వైకాపా తీసుకొచ్చిన జీవో 117 రద్దు
■ ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం

'విలీనం' పేరుతో గత ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసింది.. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి ఊరి బడికి ఉరేశారు.. విద్యార్థులు ప్రైవేటు బడి బాట పట్టారు.. ఫీజుల భారం భరించలేక కొందరు చదువుకు దూరమయ్యారు.. సమస్యను గుర్తించిన 'కూటమి' ప్రభుత్వం గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117ను రద్దు చేయాలని నిర్ణయించింది. జీవో 117 రద్దుతో ఊరి బడి (ప్రాథమిక పాఠశాల)కి ఊపిరి పోసినట్లైందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల నియామకానికి జీవో 53 అమలవుతుంది. 98 మంది కంటే తక్కువ పిల్లలున్న ఉన్నత పాఠశాలలకు కొత్తరూపు రానుంది. ప్రాథమికోన్నత పాఠశాలలకు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమిస్తారు.



నంద్యాల మండలం బ్రాహ్మణపల్లె ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. దీంతో ఆ పాఠశాలలో ఒక్క విద్యార్థే మిగిలారు.. ఆ బాలుడు దివ్యాంగుడు. ఈ ఏడాది విద్యార్థులు, ప్రవేశాలు లేకపోవడంతో పాఠశాలకు తాళం వేశారు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే:

30 వేల మంది ప్రైవేటు బాట

గత వైకాపా ప్రభుత్వం ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం ప్రభుత్వ పాఠశాలలకు శాపంగా మారింది. ప్రాథమిక తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో సర్కారు బడుల్లో చేరేవారి సంఖ్య తగ్గిపోయింది. వేలాదిమంది ప్రైవేటు పాఠశాలల బాట పట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత నాలుగేళ్లలో సుమారు 30 వేల మంది చిన్నారులు ప్రభుత్వ పాఠశాలల నుంచి వెళ్లిపోయారు. దీంతో ఏటా పదుల సంఖ్యలో ప్రాథమిక బడులు మూతపడుతున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం విలీనం ప్రక్రియను రద్దు చేసింది.

పాఠశాల మనుగడే ప్రశ్నార్థకం

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 276 ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను సమీపంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో సుమారు 167 పాఠశాలల్లో పది మందిలోపే విద్యార్థులు మిగిలారు.
- 97 పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్కరూ చేరలేదు. ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలలు ఉమ్మడి జిల్లాలో 8 వరకు ఉన్నాయి.
- 3, 4, 5 తరగతుల వారికి స్కూల్ అసిస్టెంట్లతో బోధన అందిస్తామని జగన్ సర్కారు గొప్పలు చెప్పింది. ఆచరణలో విఫలమైంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 723 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ఈ ప్రక్రియ తీవ్ర గందరగోళానికి దారి తీసింది. మరోవైపు ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలల సంఖ్య పెరిగిపోయింది.
- కర్నూలు జిల్లాలో పది మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలు 23 ఉన్నాయి. ఆలూరు మండలం పెద్దహోతూరు ప్రాథమిక పాఠశాల, హాలహర్వి మండలం చిన్నహోతకుంట, కోడుమూరులోని బోయగేరి, మండలంలోని లద్దగిరి, మండల కేంద్రం కోసిగిలోని రెండు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఐదుగురిని మించలేదు.
- నంద్యాల జిల్లాలోని 98 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు పదిమంది లోపే ఉన్నారు. గోస్పాడు మండలం ఎం.కృష్ణాపురం ప్రాథమిక పాఠశాల్లో ఒక్క విద్యార్థే ఉన్నారు.

రోళ్లపాడు రమ్మంటోంది


✤ పర్యాటకుల విడిదికి ఏర్పాట్లు ✤ నవంబరు 1 నుంచి సందర్శన

పక్షి జాతుల సందడి.. కృష్ణజింకల పరుగులు.. దుప్పుల గంతులు.. అడవి తోడేళ్ల అరుపులు.. పక్షుల కిలకిలరావాలు.. ఆఫ్రికన్ సవన్నా ప్రాంతాన్ని తలపించే రోళ్లపాడు అభయారణ్యం ప్రకృతి అందాలు తిలకించడానికి అటవీ శాఖ ఆహ్వానం పలుకుతోంది. మిడుతూరు మండలంలో నెలకొన్న ఈ అభయారణ్యాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. పక్షి ప్రేమికులకు కనువిందు చేయనుంది. నల్లమల అటవీ ప్రాంతం, పక్షులు, వన్యప్రాణుల సందర్శనలో భాగంగా నవంబరు 1 నుంచి పర్యాటకుల సందర్శనకు సిద్ధం చేస్తున్నారు.

ఆత్మకూరు, నందికొట్కూరు, మిడుతూరు, న్యూస్‌టుడే :

పర్యావరణ విజ్ఞాన కేంద్రం

నల్లమల అరణ్యం విశిష్టతను వివరించేందుకు ఇక్కడ పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నల్లమల వివరాలు, పక్షులు, వన్యప్రాణులు వాటి జీవన విధానంపై అవగాహన పెంపొందించేందుకు డాక్యుమెంటరీ ప్రదర్శిస్తారు. రకరకాల పక్షుల వివరాలు తెలిపే చిత్రాలు ఇక్కడ ఏర్పాటు చేశారు.



విభాగం	రకాలు
పక్షిజాతులు	202
క్షీరదాలు	21
సరీసృపాలు	27
ఉభయ చరాలు	9
సీతాకోక చిలుకలు	62
తూనీగలు	8

● విభాగం
● రకాలు

బట్టమేక పక్షి సంరక్షణ కేంద్రం

అంతరించి పోయే ప్రమాదాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్న పక్షిజాతుల్లో బట్టమేక పిట్ట ఒకటి.. రాష్ట్రంలో 1998లో సుమారు 25 వరకు ఉండేవి.. రోళ్లపాడు ప్రాంతంలో ఇవి కనిపించడంతో కాపాడేందుకు 1988లో అభయారణ్యాన్ని ఏర్పాటు చేశారు. ఈ పక్షి మూడున్నర నుంచి నాలుగడుగుల ఎత్తు వరకు ఉంటుంది.. గడ్డి మైదానంలో ఎక్కువగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో మిడుతూరు మండలం రోళ్లపాడులో 9.37 చ.కి.మీ విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఐదారేళ్ల కిందట బట్టమేక పక్షి వచ్చి గుడ్డు పెట్టి వెళ్లినట్లు గుర్తించారు. మళ్లీ రావడం లేదు.

విడిది.. సఫారీ ఇలా

రోళ్లపాడును సందర్శించే పర్యాటకుల సౌకర్యార్థం విడిది కేంద్రం, సఫారీ ఏర్పాటు చేశారు. ఇక్కడ నాలుగు ఏసీ గదులు నిర్మించారు. ఒక్కో గదికి నిత్యం రూ.4 వేలు చెల్లించాలి. ఇద్దరు వ్యక్తులకు వసతి, భోజనం, సఫారీ కల్పిస్తారు. డార్మెటరీలో విడివిడిగా 8 బెడ్లు ఉన్నాయి. ఒక్కో బెడ్‌కు రోజుకు రూ.1500 చెల్లించాలి. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్ఎస్‌టీఆర్.కో.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి రోళ్లపాడు అభయారణ్యంలో గదులను బుక్ చేసుకోవచ్చు.

సంక్షేమానికి శ్రీకారం.. కార్మికులకు వరం

- పథకాల పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం చర్యలు
- నూతన సభ్యత్వ నమోదు చేపట్టిన అధికారులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమాన్ని పాలకులు గాలికి వదిలేశారు. సంక్షేమ బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్లించారు. గత ఐదేళ్లుగా కార్మికులకు సంక్షేమ పథకాలు, రావాల్సిన క్లైంలు నిలిపివేశారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు భరోసా ఇచ్చేందుకు ముందడుగు వేసింది. కార్మికుల సంక్షేమ చట్టం అమలుకు శ్రీకారం చుట్టింది. కార్మిక సంక్షేమ చట్టం ప్రయోజనాలు అందరికీ చేరేలా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో కార్మిక శాఖ అధికారులు నంద్యాల జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు కార్మికుల నమోదు చేపట్టారు. భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల చట్టం 1996 ప్రకారం కార్మికులు ఈ పథకంలో సభ్యులుగా చేరి గుర్తింపు పత్రాలు తీసుకుంటే ఆర్థిక, ఇతర ప్రయోజనాలు పొందే అవకాశం లభిస్తుందని కార్మిక శాఖ అధికారులు చెబుతున్నారు.



జగజ్జనని నగర్‌లో కార్మికుల నమోదు చేపడుతున్న అధికారులు

నమోదైంది 77 వేల మందే

నంద్యాల జిల్లాలో భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు లక్ష సంఖ్యలో ఉన్నారు. వీరిలో సుమారు 77 వేల మంది వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది అక్టోబరు నెల వరకు రెన్యువల్ చేసుకున్న వారు 14,009 మంది ఉన్నారు. కార్మిక శాఖ అధికారులు 200 రోజుల ప్రణాళికలో భాగంగా జిల్లాలో డిసెంబరు చివరి నాటికి 900 మంది కార్మికులను కొత్తగా నమోదు చేయాల్సి ఉంది. ఇప్పటికే 912 మంది భవన, ఇతర నిర్మాణరంగ కార్మికులను నమోదు చేశారు.

నమోదు ఇలా..

18 నుంచి 59 ఏళ్లలోపు వయసు కలిగిన భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికులు సంక్షేమ పథకం కింద పేర్లు నమోదు చేసుకోవచ్చు. వయసు ధ్రువీకరణకు రేషన్‌కార్డు, ఓటరుకార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు జత చేయాలి. ఏడాదిలో 90 రోజులకు తక్కువ కాకుండా భవన, ఇతర నిర్మాణ రంగంలో పనిచేసి ఉండాలి. ఐదేళ్లకు గాను రూ.110 కార్మికుల నమోదు రుసుం చెల్లించి సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలి. కార్మిక శాఖ కార్యాలయంలో లేనిచో అందజేయాలి. ఐదేళ్ల తర్వాత ఒకసారి రూ.60 చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి.

వర్తించే పథకాలు

కార్మికులు పనిచేసే ప్రదేశాల్లో ప్రమాదవశాత్తు మృతి చెందినా లేదా పూర్తిగా వైకల్యానికి గురైనా రూ.5 లక్షలు చెల్లిస్తారు. 50 శాతం, అంతకు మించి వైకల్యానికి గురైతే రూ.లక్ష ఇస్తారు. 50 శాతంలోపు వైకల్యం బారినపడితే రూ.50 వేలు, 25 శాతం వరకు అయితే రూ.25 వేలు ఇస్తారు. సాధారణ మృతికి రూ.60 వేల ఆర్థిక సాయం, అంతిమ సంస్కారాలకు రూ.20 వేలు అందిస్తారు. వివాహితకు ప్రసూతి సాయం కింద రూ.20 వేలు (2 ప్రసవాలకు) చెల్లిస్తారు. ఈ పథకం కార్మికుని భార్య, కుమార్తెకు కూడా వర్తిస్తుంది. అనారోగ్యంతో బాధపడే సమయంలో రోజుకు రూ.300 చొప్పున నెలలో రూ.3 వేలు అందజేస్తారు.

అందరూ సభ్యత్వం తీసుకోవాలి

- బషీరున్నిసా బేగం, కార్మిక శాఖ సహాయ కమిషనరు, నంద్యాల

నంద్యాల జిల్లాలో ఉన్న ప్రతి భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుడు కార్మిక సంక్షేమ చట్టంలో లబ్ధిదారుగా నమోదు చేసుకోవాలి. దీనివల్ల సమస్యలు వచ్చినప్పుడు కార్మికుడు, వారి కుటుంబ సభ్యులకు సంక్షేమ పథకాలు అందుతాయి. కార్మిక సంక్షేమ చట్టంపై అవగాహన కల్పిస్తూ, నూతన సభ్యుల నమోదు చేపట్టాం.

ఆటేదైనా పతకమే!

మహిత... పతకాల విజేత

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: బాలికలు చదువుతో పాటు ఆటల్లోనూ సత్తా చాటి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయాలు సాధిస్తున్నారు. ఆళ్లగడ్డ మండలం లోని కోటకందుకూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయిని శ్రీలత వద్ద మెలకువలు నేర్చుకొని తైక్వాండో, రెజ్లింగ్, రోప్ స్కిప్పింగ్ పోటీల్లో రాణిస్తు నేటితరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి ప్రశంసలు పొందుతున్నారు.



దొర్నిపాడు మండలం ... కు చెందిన మణికుమార్ కుమార్తె మహిత కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతోంది. ఆటలపై ఆసక్తితో తైక్వాండో, రోప్ స్కిప్పింగ్‌లలో తర్ఫీదు పొందింది. శిక్షణలో మెళకువలు నేర్చుకొని పోటీలకు సన్నద్ధమైంది. గత నెల 30న నంద్యాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని 58 కేజీల విభాగంలో ప్రత్యర్థితో తలపడి మొదటిస్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో అందుకు తగినట్లు తర్ఫీదు తీసుకొంది. రాష్ట్రస్థాయి పోటీలు తిరుపతిలో ఈ నెల 6నుంచి 10వ జరగ్గా... అందులోనూ ప్రతిభను చూపించింది. ప్రత్యర్థితో తలపడి విజయానికి శ్రమించి ప్రశంసాపత్రం అందుకొంది. ఈఏడాదిలోనే రోప్‌స్కిప్పింగ్ జాతీయస్థాయి పోటీల్లో రాణించి స్వర్ణ పతకాన్ని సాధించింది.

రెజ్లింగ్‌లో ప్రతిభ

అహోబిలానికి చెందిన సుబ్బరాజు, మల్లేశ్వరి దంపతుల కుమార్తె లక్ష్మీప్రసన్న కోటకందుకూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. క్రీడలపై ఆసక్తితో రెజ్లింగ్‌లో తర్ఫీదు పొందింది. శిక్షణలో మెళకువలు నేర్చుకొని నంద్యాలలో గత నెల 23న జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో సత్తా చాటింది. 30 కేజీల విభాగంలో ప్రత్యర్థిని చిత్తుచేసి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విజయవాడలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి ప్రత్యర్థిని ఓడించి విజయాన్ని దక్కించుకొంది. క్రీడల్లో జాతీయస్థాయిలో రాణించి పోలీసు కావడమే లక్ష్యమని లక్ష్మీప్రసన్న చెబుతోంది.



పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: తుపాను కారణంగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు ఉత్తర్వులు వచ్చాయని రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. షాలిమార్ నుంచి వాస్కోడిగామాకు డోన్ మీదుగా వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్ (18047) ఈ నెల 24న, వాస్కోడిగామా నుంచి షాలిమార్‌కు డోన్ మీదుగా వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్ (18048) ఈ నెల 27న, భువనేశ్వర్ నుంచి బెంగళూరుకు డోన్ మీదుగా వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463)ను ఈ నెల 25న రద్దు చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: 2024-25 విద్యా సంవత్సరంలో నంద్యాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఐదో విడత ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాలల జిల్లా కన్వీనర్ ఎస్. ప్రసాదరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ లోపు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింటు తీసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లతో సహా ఈ నెల 27వ తేదీ లోపు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో తనిఖీ చేయించుకోవాలని పేర్కొన్నారు. లేని పక్షంలో మెరిట్ జాబితాలో అభ్యర్థుల పేరు పొందుపరచరని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలలో ఈ నెల 28న, ప్రైవేట్ ఐటీఐలలో ఈనెల 30న ప్రవేశాలకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు.

అంతా పచ్చగా..జనాలు మెచ్చగా

కర్నూలు మండలం పడిదెంపాడు నుంచి పూడూరు వెళ్లే రహదారికి ఇరువైపులా పంట పొలాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మధ్యలో తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. పచ్చని ప్రకృతి అందాలు ఆ మార్గంలో వెళ్లే ప్రతిఒక్కరినీ కట్టిపడేస్తున్నాయి. - ఈనాడు, కర్నూలు



రాకపోకలకు ఇక్కట్లు

పట్టణంలోని త్రివర్ణకాలనీలో రోడ్డు మధ్యలో ఇనుప విద్యుత్తు స్తంభం వల్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. స్తంభానికి ఇరువైపులా దారిలో ఇనుప ఊచలను ఏర్పాటు చేయడంతో ఇబ్బంది కలుగుతోందని నివాసితులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు రహదారి మధ్యలో ఉన్న ఇనుప స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, డోన్‌పట్టణం



ఎస్సార్బీసీ కాల్వకు గండి



కాల్వకు పడిన గండి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల నుంచి గుంజలపాడుకు వెళ్లే దారిలో ఉన్న ఎస్సార్బీసీ పదో బ్లాక్ మేజర్ కాల్వకు బుధవారం గండి పడింది. కట్ట బలహీనంగా ఉండి తెగిపోవడంతో కాల్వలో ప్రవహించే నీరంతా సమీపంలోని పొలాల్లోకి చేరింది. ప్రస్తుతం పొలాల్లో ఎలాంటి పంటలు సాగు చేయకపోవడంతో నష్టం జరగలేదు. కాల్వకు గండి పడిన విషయాన్ని రైతులు సంబంధిత అధికారులకు చెప్పడంతో డీఈ బాల్సీ, ఏఈ సురేంద్ర ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పదో బ్లాక్ నీటి సరఫరాను ఆపివేసి వెంటనే గండి పూడ్చేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు.

రీసర్వే ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రీసర్వేపై వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నవంబరు 30లోపు పరిష్కరించాలని కలెక్టర్ జి.రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లో రెవెన్యూ అంశాలపై బుధవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 211 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని తెలిపారు. రోవర్‌తో భౌతికంగా కొలతలు వేసినా ఒకే విస్తీర్ణం వస్తుందన్న విషయాన్ని రైతులకు వివరించాలన్నారు. జిల్లాలో జరుగుతున్న ఏడు జాతీయ రహదారుల నిర్మాణ పనులకు సంబంధించిన భూ సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీఎంవో ఫిర్యాదులు రీఓపెన్ అయితే కారణాలను వివరించాలన్నారు. జిల్లాలో 14,280 ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి స్వయంగా సంతకాల ప్రతులను అందజేయాలన్నారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ నిబంధనలకు విరుద్ధంగా జరిగింది, ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ.. రీసర్వే పనులు పూర్తి చేయడంతో పాటు కోర్టు కేసులకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను నవంబరు 6వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. డీఆర్వో పద్మజ, ఆర్డీవోలు మల్లికార్జునరెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎం.దాసు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రతిభ చాటాలి.. అగ్నివీరులవ్వాలి

- కడపలో వచ్చే నెల 10 నుంచి ర్యాలీ
- దళారుల విషయంలో అప్రమత్తత అవసరం



కర్నూలు క్రీడలు (వి.క్యాంపు), న్యూస్‌టుడే: అగ్నివీర్ నియామకాల ప్రక్రియకు సమయం దగ్గర పడుతోంది. వివిధ పోస్టులకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో ప్రకటన విడుదలైంది. ఫిబ్రవరి 13 నుంచి మార్చి 22వ తేదీ వరకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 2 లక్షల మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు మాజీ సైనిక సంఘం నాయకులు పేర్కొంటున్నారు. వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు నవంబరు 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కడప నగరంలోని డీఎస్‌ఏ స్టేడియంలో జరిగే అగ్నివీర్ ర్యాలీకి హాజరవ్వాల్సి ఉంటుంది.

ఉద్యోగాల పేరుతో..

అగ్నివీర్‌కు సంబంధించి ఎక్కువ పోస్టులు ఉండటం.. ప్రకటన విడుదల కావడంతో దళారులు రంగంలో దిగారు. అమాయకులైన అభ్యర్థులను మభ్యపెట్టి ఉద్యోగాలిప్పిస్తామంటూ మోసం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగాల పేరుతో దళారులు డబ్బులు వసూలు చేసే అవకాశముంది. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్మీ అధికారులు సూచిస్తున్నారు.



సత్తా చూపితేనే..

- వివిధ ఉద్యోగాలకు సంబంధించి హాజరయ్యే అభ్యర్థులు 162 నుంచి 165 సెంటీమీటర్ల ఎత్తు కలిగి ఉండాలి. ఛాతి 77 సెం.మీ. ఉండి.. గాలి పీల్చితే ఐదు సెం.మీ. పెరగాలి. కనీసం 60 కిలోల బరువు ఉండాలి.
- పరుగును రెండు విభాగాల్లో నిర్వహించారు. గ్రూప్ 1 కేటగిరీలో 1.6 కి.మీ. పరుగును 5.30 నిమిషాల్లో పూర్తి చేస్తే 10 మార్కులు ఇస్తారు. గ్రూప్-2 కేటగిరీలో 1.6 కి.మీ. పరుగును 5.31 నిమిషాల నుంచి 5.45 నిమిషాల్లో పూర్తి చేస్తే 9 మార్కులు ఇస్తారు.



ఇవి ఉంటే అదనపు మార్కులు

ఎన్‌సీసీ 'ఏ' పత్రం ఉన్నవారికి 5 మార్కులు, 'బి' పత్రం ఉన్నవారికి 10, ఎన్‌సీసీ 'సి' పత్రం ఉంటే 20 మార్కులు, దిల్లీ స్థాయిలో పరేడ్‌లో పాల్గొన్నవారికి 25 మార్కులు కేటాయించారు. క్రీడా పత్రాలు ఉన్నవారికి సైతం కొన్ని మార్కులు నిర్ణయించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ, స్థాయి పోటీల్లో పాల్గొన్నవారికి కొన్ని పాయింట్లు ఇస్తారు.

ఇవి తప్పనిసరి

అగ్నివీర్ ర్యాలీకి హాజరయ్యేవారు తప్పనిసరిగా వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిట్ కార్డు ప్రింటు తీసుకోవాలి. వీటితోపాటు అంతర్జాలంలో డౌన్‌లోడ్ చేసిన పత్రాలను సైతం తీసుకెళ్లాల్సి ఉంటుంది. అసనరమైతే.. గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయిస్తే మేలు. ఈ పత్రాలు చూపితేనే ర్యాలీలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. లేకుంటే ఇబ్బందులు తప్పవు. ఉదయం 5 గంటల నుంచే ర్యాలీ ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని మాజీ సైనిక అధికారులు వెల్లడించారు.

పారదర్శకంగా నియామకాలు

- కల్నల్ పునీత్‌కుమార్, గుంటూరు ఆర్మీ నియామక కార్యాలయ డైరెక్టర్

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో అభ్యర్థులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి నవంబరు 10 నుంచి 15వ తేదీ వరకు కడప డీఎస్‌ఏ స్టేడియంలో ర్యాలీ జరుగుతుంది. నియామకాలు పారదర్శకంగా జరుగుతాయి. అర్హులందరికీ న్యాయం జరుగుతుంది. మోసగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

భక్తులకు సౌకర్యాలు మెరుగుపర్చాలి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించే భక్తులకు సౌకర్యాలు మెరుగుపర్చాలని ఇన్‌ఛార్జి ఈవో ఇ.చంద్రశేఖరరెడ్డి ఆదేశించారు. శ్రీశైలంలోని పలు ప్రదేశాల్లో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. రానున్న కార్తిక మాసోత్సవాలను పురస్కరించుకొని చేపట్టాల్సిన పనులపై అధికారులతో చర్చించారు. అన్నపూర్ణ భవన్, గణేశ్



అన్నపూర్ణ భవనును పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి ఈవో చంద్రశేఖరరెడ్డి

సదన్, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. అన్నపూర్ణ భవన్‌లో అన్నప్రసాద తయారీ వివరాలు తెలుసుకున్నారు. గణేశ్ సదన్ వద్ద భక్తుల సౌకర్యార్థం కల్యాణ కట్ట ఏర్పాటు చేయాలని ఈఈ నరసింహారెడ్డిని ఆదేశించారు. ఛారిటీ హెల్త్ బంక్ వద్ద కొత్తగా ఏటీఎం ఏర్పాటు చేయాలని చెప్పారు. క్షేత్రంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. కార్తిక మాసోత్సవాల్లో సిబ్బంది సమన్వయంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

గిరిజన గురుకులం పరిశీలన



దస్త్రాలను పరిశీలిస్తున్న వీవీఎస్ మురళీకృష్ణ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ అదనపు న్యాయమూర్తి ఆర్ వీవీఎస్ మురళీకృష్ణ బుధవారం పట్టణ శివార్లలోని గిరిజన గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి గురుకులంలో విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న వసతులను తెలుసుకున్నారు. భోజన మెను, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రిన్సిపల్ ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలపై నిరంతర పర్యవేక్షణ

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : పోలీస్ కంట్రోల్ రూంతో అనుసంధానం చేసిన 250 సీసీ కెమెరాలను నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సిబ్బందిని ఆదేశించారు. నంద్యాల పట్టణంలోని పోలీస్ కంట్రోల్ రూంను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలోనే కాకుండా అపార్టుమెంట్లు, వ్యాపార సముదాయాలు, శివారు ప్రాంతాల్లో కూడా ప్రజలు సీసీ ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

పొగాకులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పులిమద్ది (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే : ఖరీఫ్‌లో కురిసిన వర్షాలకు పొగాకు పంటకు నల్లకాడ తెగులు సోకిందని, రైతులు తక్షణం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొగాకు శాస్త్రవేత్త పుల్లబాయి సూచించారు. శాస్త్రవేత్త శివరామకృష్ణతో కలిసి బుధవారం ఆమె నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పొగాకు పంటను పరిశీలించారు. నల్లకాడ తెగులు నివారణకు రిడోమిల్ గోల్డ్ మందును లీటరు నీటిలో 2 మి.మీ కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. లద్దె పురుగు, ఇతర తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు వివరించారు.



పొగాకు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఉరేసుకుని వ్యక్తి మృతి

అవుకు, న్యూస్‌టుడే: మండలంలోని ఇసానాయక్ తండాకు చెందిన అంజినాయక్ (32) ఉరేసుకుని చనిపోయారని ఎస్సై రాజారెడ్డి బుధవారం తెలిపారు. పూర్తి సమాచారం అందాల్సి ఉందన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

తపాలా ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : గ్రామీణ తపాలా ఉద్యోగులపై లక్ష్యాల పేరుతో వేధింపులు ఆపాలని ఎన్ఎఫ్‌పీఈ డివిజన్ పీ4 సెక్రటరీ మధుసూదన్, ఏఐజీడీఎస్‌యూ నాయకులు జమాల్ బాషా డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణం గాంధీచౌక్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట బుధవారం ఎన్ఎఫ్‌పీఈ, ఏఐజీడీఎస్‌యూ నాయకులు, తపాలా ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. మితిమీరిన లక్ష్యాలు, కర్ణాటక తరహాలో ఆన్‌లైన్ కార్యక్రమాలు వెంటనే ఆపాలన్నారు. లేదంటే నవంబరు 12, 13 తేదీల్లో దిల్లీలోని డాక్ భవన్ ఎదుట నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఆందోళనలో హెడ్‌పోస్ట్ మాస్టర్ బాలాజీ, పోస్టుమెన్ జిలాని, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎన్ఎఫ్‌పీఈ, ఏఐజీడీఎస్‌యూ నాయకులు, తపాలా ఉద్యోగులు

వందల ఎకరాల్లో పంటలకు నష్టం

అవుకు, న్యూస్‌టుడే: ఎస్సార్బీసీ నుంచి అవసరానికి మించి ప్రవహిస్తున్న నీళ్లు రైతులకు సరికొత్త సమస్యల్ని సృష్టిస్తున్నాయి. తరచూ కురుస్తున్న వానల వల్ల ఇప్పటికే నష్టాలను ఎదుర్కొంటున్న రైతులకు అదనపు నీళ్లు మరింత నష్టాన్ని కలిగిస్తున్నాయి. చెర్లోపల్లె, శింగనపల్లె, ఓబులాపురం గ్రామాల పరిధిలో మిరప, పొగాకు పంటలను విస్తారంగా సాగు చేశారు. ఎస్సార్బీసీ నుంచి వస్తున్న అదనపు నీటి వల్ల దాదాపు వంద ఎకరాల్లో పంటలు నష్టపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సార్బీసీ 12, 13, 14 బ్లాకుల నుంచి అవసరానికి మించి నీరు వస్తుండటంతో పొలాల్లో ప్రవహిస్తూ ఇబ్బందులు కలుగుతున్నాయని రైతులు వెల్లడించారు. అవుకు జలాశయ అధికారులతో పాటు ఎస్సార్బీసీ అధికారులు చొరవ తీసుకొని నీటి ప్రవాహాన్ని నియంత్రించాలని సూచిస్తున్నారు.

గాలేరు- నగరి కాల్వలో గేదెల గల్లంతు

పాణ్యం (గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని సూగాలిమెట్ట సమీపంలో ఉన్న గాలేరు- నగరి కాల్వలో 27 గేదెలు జారిపడి కొట్టుకుపోయాయి. విషయం తెలుసుకున్న పశు సంవర్ధక శాఖ ఏడీఏ హెచ్ కమలాకర్, పశువైద్యులు నవీన్ ఘటనా స్థలానికి చేరుకుని రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఐనగానపల్లి మండలం రామతీర్థం సమీపంలో కొట్టుకుపోయిన పశువులను గుర్తించి సిబ్బంది, రైతులు, గ్రామస్థుల సహకారంతో 15 గేదెలను బయటకు తీశారు. మిగతా 12 గేదెల ఆచూకీ తెలియాల్సి ఉందని, వాటి కోసం కాలువ వెంట గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



జీఎన్ఎస్ఎస్ కాల్వలో కొట్టుకుపోతున్న గేదెలు

నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

టౌన్‌హాల్‌ను అందుబాటులోకి తీసుకురండి


తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : పట్టణం నడిబొడ్డున విశాల ఆవరణలో ఉన్న టౌన్‌హాల్‌ను ఎందుకు నిరుపయోగంగా వదిలేశారని కలెక్టర్ జి.రాజకుమారి పురపాలక అధికారులను ప్రశ్నించారు. నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి టౌన్‌హాల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సీలింగ్, లైట్లు, ఫ్యాన్ల ఏర్పాటు, మరమ్మతులకు ప్రతిపాదనలు ఇవ్వాలని చెప్పారు. ఆర్డీవో మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : సున్నిపెంటలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రవీంద్రబాబు బుధవారం తెలిపారు. రెండేళ్ల కోర్సులు ఫిట్టర్, టర్నర్, ఏడాది కోర్సులు మెకానికల్ డీజిల్, వెల్డర్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9703395091, 9440748448 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

పాణ్యం గ్రామీణం : సమస్య : పాణ్యం డొంగు నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారిలో వీధిదీపాలు లేక రాత్రిళ్లు ఇబ్బందిగా ఉంది. **- సురేష్, స్థానికుడు**

సమస్య : పాణ్యం బస్టాండు సమీపంలోని కాలనీలకు తాగునీరు అందడం లేదు. **- జానకి, స్థానికురాలు**

సమాధానం: వీధిదీపాలు ఏర్పాటుచేస్తాం. నీటి సమస్య పరిష్కరిస్తాం. **- ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి**

ప్రతిభకు మెరుగులు.. నూతన ఆవిష్కరణలకు దారులు



నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే : ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థుల సృజనకు మెరుగులు దిద్దడం ద్వారా నూతన ఆవిష్కరణలకు బాటలు వేస్తాయని నంద్యాల శ్రీగురురాజ పాఠశాల సంచాలకులు పి.షేక్షావలిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎన్జీవో కాలనీలోని పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ, నష్టాలు- విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం' అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. నాగకీర్తి ప్రథమ, హంసప్రియ ద్వితీయ, వైష్ణవి తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల సంచాలకులు, సమన్వయకర్త జి.వీరయ్య బహుమతులు అందజేశారు.



నందికొట్కూరు, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను గుర్తించేందుకు పోటీ పరీక్షలు ఉపకరిస్తాయని విస్డమ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సలీమ్ పేర్కొన్నారు. నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరులోని విస్డమ్ పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ, నష్టాలు- విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం' అన్న అంశంపై వ్యాసరచన పోటీ జరిగాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎస్.అయేషా, పదో తరగతికి చెందిన సబామహీన్, 8వ తరగతి విద్యార్థిని ఈక్షితలకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.



ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను వెలికి తీయొచ్చని డీపాల్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ ఫాదర్ షిన్స్, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ వినీత్ పేర్కొన్నారు. ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలోని డీపాల్ పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు జరిగాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన పదో తరగతి విద్యార్థి వివేక్‌రాజ్, 9వ తరగతి విద్యార్థి ఎస్.కె.షాఫిక్ అహ్మద్, పదో తరగతికి చెందిన నిహారికలకు ప్రిన్సిపల్ బహుమతులు అందజేశారు.

వైద్యం నామమాత్రం.. రోగులపై భారం

☛ సర్వజన ఆసుపత్రిలో ఔషధాల కొరత తీవ్రం
☛ బయటకు రాసిస్తున్న వైద్యులు


ఆసుపత్రిలో ఓపీ తీసుకుంటున్న రోగులు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల సర్వజన ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నాం.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు ప్రకటిస్తున్నారు. ఇది నిజమని నమ్మి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పేదలు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఆసుపత్రిలో చేరాక సేవల్లో డొల్లతనం వెల్లడవుతోంది. కొన్ని రకాల మందులతో పాటు ఐవీసెట్లు, ఇతర వైద్య పరికరాలను రోగులే బయట కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడ సరైన వైద్యం అందదని తెలిసినా.. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేని పేదలు ఇక్కడే చేరి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వీటికి కటకట..



పాంటప్ ఇంజెక్షన్లు, అప్తాలిన్, డెరిక్లిన్, డెక్ట్రాన్, కొన్ని రకాల యాంటిబయాటిక్ మందులు అందుబాటులో లేవు. ఇన్సులిన్ ఇంజెక్షన్లు కూడా అరకొరగా ఉన్నాయి.


వైద్యాలయం :	సర్వజన ఆసుపత్రి, నంద్యాల
రోజూ నమోదయ్యే ఓపీ :	1300 మంది
మొత్తం పడకల సంఖ్య :	350
ఆసుపత్రిలో చేరి చికిత్స పొందే వారు :	350 మంది
రోజుకు ఆసుపత్రిలో చేరే వారు :	120 మంది

రెండు నెలలుగా సరఫరా లేదు

సర్వజన ఆసుపత్రిలో మందులు కొరత తీవ్రంగా వేధిస్తోంది. కొన్ని రకాలు నెలల తరబడి సరఫరా కావడం లేదు. అత్యవసరమైన ఔషధాలు కూడా లేవు. రోగులు వాటిని తప్పనిసరిగా వాడాల్సి ఉంటే వైద్యులు బయట తెచ్చుకోవాలని రాసిస్తున్నారు. బయట వీటి ధరలు అధికంగా ఉండటంతో నిరుపేదలపై భారం పడుతోంది. ఔషధాల కొరత కారణంగా నిత్యం వేలాదిమంది రోగులకు అవస్థలు తప్పడం లేదు.

వైద్యులు	ఉన్నది	ఖాళీలు
ప్రొఫెసర్లు	11	15
అసోసియేట్ ప్రొఫెసర్లు	29	19
అసిస్టెంట్ ప్రొఫెసర్లు	45	24

క్యాన్యులా కొంటేనే సెలైన్ పెట్టేది



ఆసుపత్రికి అత్యవసర వైద్యం కోసం వచ్చిన రోగులకు సెలైన్లు ఎక్కించాల్సి ఉంటుంది. ఇక్కడ వాటిని ఎక్కించేందుకు అవసరమైన క్యాన్యులాలు లేవు. దీంతో బయట దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. రాత్రిళ్లు వచ్చిన రోగులు వాటి కోసం పట్టణమంతా తిరగాల్సి వస్తోంది. నెలలు తరబడి క్యాన్యులాల సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం ఒక రకం 4 వేలు మాత్రమే వచ్చాయి. ఇవి నెలకు మాత్రమే సరిపోతాయి. వీటిని ఎక్కువగా శస్త్రచికిత్స చేయించుకున్న వారికి, చిన్నపిల్లలకు వాడుతున్నారు. మిగతా రోగులు బయట రూ.120 నుంచి రూ.150 వరకు చెల్లించి తెచ్చుకోవాల్సిన వస్తోంది.

సిబ్బంది అరకొరే..

నంద్యాల సర్వజన ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉంది. ఇటీవల వైద్యుల ఖాళీలు భర్తీ చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. నర్సులు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టులు ఎక్కువగా ఖాళీ ఉన్నాయి. జనరల్ డ్యూటీ అసిస్టెంట్లు (జీడీఏ) పోస్టులు 50 ఖాళీగా ఉండటంతో సేవలు సరిగా అందడం లేదు.

యాంటీబయాటిక్స్ బయటకొన్నా

– మహేశ్వరరెడ్డి, ఎన్జీవో కాలనీ



కాలి గాయం తగ్గకపోవడంతో సర్వజన ఆసుపత్రికి వెళ్లాను. వైద్యులు చూసి యాంటీబయాటిక్ మందులు రాశారు. ఆ మోతాదులో మందులు ఆసుపత్రిలో లేవని సిబ్బంది చెప్పారు. దీంతో రూ.120 పెట్టి బయట కొనుగోలు చేశాను.

పలువురిపై కేసుల నమోదు

మహానంది, న్యూస్‌టుడే : మహానంది మండలం అబ్బీపురం గ్రామానికి చెందిన వెంకటపావని ఫిర్యాదు మేరకు ఆమె భర్త వెంకటేశ్వర్లు, మేనమామ సుబ్బరాయుడుపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్.రామ్మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు పావనితో రెండేళ్ల కిందట వివాహమైందన్నారు. ఆ సమయంలో 18 తులాల బంగారం ఇచ్చారని, అదనంగా మరో పది తులాల బంగారం తేవాలని వారు వేధిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారని వివరించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పోలూరు (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే : పాత కక్షలు మనసులో పెట్టుకుని తనను ముగ్గురు వ్యక్తులు దూషించారంటూ మండలంలోని పోలూరు గ్రామానికి చెందిన దఫేదార్ అర్షియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై గంగయ్యయాదవ్ బుధవారం తెలిపారు. అర్షియాకు అదే గ్రామానికి చెందిన అబ్దుల్‌ఖలీల్, ఖాదర్, యాస్మిన్‌తో పాత కక్షలు ఉన్నాయన్నారు. గతంలో కూడా ఆమె వీరిపై కేసు పెట్టారన్నారు. దాన్ని మనసులో పెట్టుకుని బుధవారం వారు ఆమెను అసభ్యంగా దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు.

మహానంది, న్యూస్‌టుడే : మండలంలోని గోపవరం గ్రామంలో పాల వ్యాపారుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై ఎన్.రామ్మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. నంద్యాల పట్టణం దేవనగర్‌కు చెందిన మధుబాబు, రైతునగర్‌కు చెందిన అన్నదమ్ములు సుబ్బారావు, ధర్మ, మహానంది మండలం గోపవరం గ్రామస్థుడు శ్రీనివాసులు పాల వ్యాపారం విషయమై మంగళవారం గొడవపడ్డారన్నారు. ఈసందర్భంగా కత్తితో దాడి చేయడంతో మధుబాబుకు గాయాలయ్యాయన్నారు. ఆయన్ను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లుగా వివరించారు.

నిందితుడికి రిమాండు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణంలోని వీవీనగర్‌లో గంజాయి విక్రయిస్తున్న కడప నగరానికి చెందిన షేక్ గౌస్‌బాషాను బుధవారం అరెస్టు చేసినట్లు గ్రామీణ ఎస్సై గంగయ్యయాదవ్ తెలిపారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు వెల్లడించారు. గతేడాది నుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని గ్రామీణ పోలీసులు అరెస్టు చేసినట్లు వివరించారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ప్రసంగిస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ జయలక్ష్మి

మహానంది ఫారం (మహానంది), న్యూస్‌టుడే : వ్యవసాయ విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగి నూతన వంగడాల సృష్టించి దేశానికి సేవ చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి పిలుపునిచ్చారు. మండలంలోని మహానంది ఫారంలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు నూతనంగా ప్రవేశపెట్టిన 'దీక్షారంభ్' కార్యక్రమాన్ని ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆంగ్రూ ఉప కులపతి డాక్టర్ శారదాజయలక్ష్మి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాసరావు దృశ్య మాధ్యమ విధానంలో సందేశమిచ్చారు. 15 రోజుల పాటు దీక్షారంభ్ కార్యక్రమాలు సాగుతాయన్నారు.

నేరాల నియంత్రణే లక్ష్యం


స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే : నేరాల నియంత్రణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ పేర్కొన్నారు. జూపాడుబంగ్లా పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. దస్త్రాలు, స్టేషన్ గదులు, ఆవరణాన్ని పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి ఎస్సై లక్ష్మీనారాయణను ఆరా తీశారు. నందికొట్కూరు గ్రామీణ సీఐ టి.సుబ్రహ్మణ్యం, ఏఎస్సై మేరీ జయంతి పాల్గొన్నారు.

మల్లన్నకు వెండి వస్తువుల బహూకరణ


వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లకు బుధవారం హైదరాబాద్ హుజూర్‌నగర్‌కు చెందిన అద్దంకి నరసింహారావు, హరిత వెండి వస్తువులను బహూకరించారు. 955 గ్రాముల బరువు కలిగిన రెండు వెండి బిందెలు, 1.665 కిలోల గంధాక్షరి, ఐదు గిన్నెలను ఆలయ పర్యవేక్షకులు అయ్యన్న, ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునకు అందజేశారు. దాతలకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేదాశీర్వచనాలు పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జాతీయ పురస్కార గ్రహీతకు సన్మానం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ ప్రతిభా పురస్కారం గ్రహీత, శ్రీగురురాజ పాఠశాల సంచాలకులు పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు సన్మానించారు. స్థానిక పాఠశాలలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రప్ప ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. సంఘం జిల్లా సహాధ్యక్షుడు ఎం.శ్రీహరి, కోశాధికారి బి.శ్రీనివాసులు, సిటీ అధ్యక్షుడు కె.సత్యం, మహిళా అధ్యక్షురాలు ఆర్.ప్రభావతమ్మ, నాయకులు పూర్ణయ్యచారి, నాయక్, ఇంతియాజ్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.


షేక్షావలిరెడ్డిని సన్మానిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

నూతన కోర్సులు ప్రారంభించాలని వినతి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్‌లో సీహెచ్‌ఈసీ గ్రూపును ప్రారంభించడం వల్ల ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని హిస్టరీ జూనియర్ అధ్యాపకులు తెలిపారు. ఈమేరకు బుధవారం వారు విజయవాడలో ఏపీ ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికశుక్లను కలిసి వినతిపత్రం అందజేశారు. కంప్యూటర్, టూరిజం కోర్సులు ప్రవేశపెట్టడం వల్ల హెచ్‌ఈసీ గ్రూపునకు ప్రాధాన్యం పెరుగుతుందని వివరించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గారపాటి గోపీచంద్‌ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రామ్మోహన్‌రెడ్డి, వాసుదేవరావు, ఇందిర తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న అధ్యాపకులు

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎ.కోడూరు (బండిఆత్మకూరు), న్యూస్‌టుడే : నిర్ణీత గడువులోగా రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తహసీల్దారు ఆల్ఫ్రెడ్, ఉప తహసీల్దారు గురునాథం చెప్పారు. మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సదస్సులో వారు మాట్లాడారు. రైతుల నుంచి 220 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సర్పంచి జ్ఞానాభరణం, తెదేపా నాయకులు కంచర్ల లింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వీఆర్వో ఆదిశేషయ్య పాల్గొన్నారు.

బిల్లలాపురం (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని బిల్లలాపురం గ్రామంలోని బుధవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో రైతులు 40 దరఖాస్తులు అందజేసినట్లు రీసర్వే ఉప తహసీల్దారు నాగరాజు తెలిపారు. భూమి కొలతల్లో తప్పులు ఉన్నాయంటూ 20 మంది, తమ భూములు ఇతరుల పొలాలతో కలిసున్నాయని ఆరుగురు అర్జీలు ఇచ్చారన్నారు. ఉప తహసీల్దార్లు రామచంద్రరావు, మహబూబ్‌బాషా, మండల సర్వేయరు సహదేవుడు పాల్గొన్నారు.

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలోని దుర్వేశి గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించినట్లు తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. రీసర్వేలో సమస్యలపై 25 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు.

మహానందీశునికి వీహెచ్‌పీ నేతల పూజలు


వీహెచ్‌పీ జాతీయ నేతకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

మహానంది, న్యూస్‌టుడే : విశ్వహిందూ పరిషత్ జాతీయ నేతలు బుధవారం మహానంది క్షేత్రాన్ని సందర్శించారు. వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు మిలిన్‌పరండే, దక్షిణ భారతదేశ కార్యదర్శి శ్యామ్‌సత్యంజీ, క్షేత్ర అధ్యక్షుడు సాయిరెడ్డి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని అభిషేకాలు, కుంకుమార్చనలు, నామార్చన పూజలు చేశారు. ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి వారికి జ్ఞాపికలు అందజేశారు. వీహెచ్‌పీ జిల్లా నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రమౌళిరెడ్డి, వైఎన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

యర్రగుంట్ల (బండిఆత్మకూరు), న్యూస్‌టుడే : రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. బండిఆత్మకూరు మండలం యర్రగుంట్ల గ్రామంలో ఏవో స్వాతి ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని, వాటి ఫలితాల ఆధారంగా కాంప్లెక్స్ ఎరువులు వాడాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గ్రామంలో పొగాకు పంట అధికంగా దెబ్బతిందని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రాజశేఖర్, సర్పంచి శ్వేతకుమారి, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

సంక్షిప్త సమాచారం

వందశాతం రాయితీలో మినుము విత్తనాలు : ఆత్మకూరు, న్యూస్‌టుడే : రబీ సీజన్‌లో రైతులకు వందశాతం రాయితీలో వీబీఎన్-8 రకం మినుము విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. వడ్లరామాపురం, కృష్ణాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి : పగిడ్యాల, న్యూస్‌టుడే : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్‌మజీద్ డిమాండ్ చేశారు. పగిడ్యాల బస్టాండు ఆవరణలో బుధవారం సీపీఐ, సీఐటీయూ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

చట్టాల గురించి తెలుసుకోండి : ఆత్మకూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగుండాలని సీఐ ఓబులేసు సూచించారు. ఆత్మకూరు ఆదిత్య జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ విజయభాస్కర్‌నాయుడు ఆధ్వర్యంలో బుధవారం లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాది శ్రీధర్, మెరిబా స్వచ్ఛంద సంస్థ మేనేజర్ జుల్ఫీకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై అవగాహన కలిగుండాలి : ఆత్మకూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు వ్యవసాయ రంగంపై అవగాహన కలిగుండాలని ప్రభుత్వ బాలురోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, వీటీఎస్ నూర్‌మహమ్మద్ సూచించారు. పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు బుధవారం 9, 10 తరగతుల విద్యార్థులకు క్షేత్ర సందర్శన కార్యక్రమం నిర్వహించారు.

పేదలకు అండ ఎర్రజెండా : జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే : పేదల ప్రజలకు ఎర్రజెండా నిరంతరం అండగా ఉంటుందని సీపీఐ జిల్లా నాయకుడు ఎం.రమేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని సిద్ధేశ్వరం గ్రామంలో బుధవారం సీపీఐ గ్రామ శాఖ సమావేశం నరసింహ అధ్యక్షతన నిర్వహించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు : ఆత్మకూరు, న్యూస్‌టుడే : సిద్ధాపురం గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న నాటుసారా స్థావరాలపై బుధవారం దాడులు చేసినట్లు ఆబ్కారీ ఇన్‌స్పెక్టర్లు కిశోర్‌కుమార్, జగదీష్ తెలిపారు. 1400 లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేసినట్లు వెల్లడించారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని నీలిషికారి కాలనీలో బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. వెయ్యి లీటర్ల బెల్లం ఊట, 45 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై జబ్రుల్లా తెలిపారు.

ఎలుకలతో వరిపంటకు తీవ్ర నష్టం : గడివేముల, న్యూస్‌టుడే : ఎలుకల వల్ల వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని వ్యవసాయాధికారి హేమసుందరరెడ్డి తెలిపారు. గడిగరేవుల, తిరుపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎలుకల నివారణ చర్యలు వివరించారు.

విద్యార్థి బస్సులు సకాలంలో నడపాలి : ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : గ్రామీణ విద్యార్థులను పాఠశాలలకు తీసుకొచ్చే విద్యార్థి బస్సులను సకాలంలో నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్ కుమార్, మండల అధ్యక్షుడు సాయిప్రశాంత్ డిమాండు చేశారు. ఈమేరకు బుధవారం వారు ఆత్మకూరు ఆర్టీసీ డిపో అధికారి బాషాకు వినతిపత్రం అందజేశారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై ప్రజల ఆగ్రహం : నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును డ్రైవర్ అతివేగంతో ఇష్టానుసారం నడిపారని బ్రాహ్మణకొట్కూరు గ్రామస్థులు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సును వెంబడించి స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నిలిపివేశారు. డ్రైవరు క్షమాపణ చెప్పడంతో గ్రామస్థులు వదిలేశారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి : నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్సు డ్రైవర్ శివలింగమయ్యపై మంగళవారం కర్నూలులో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నంద్యాల ఆర్టీసీ డిపో డ్రైవర్లు సుదర్శన్, బాషా డిమాండ్ చేశారు. ఈమేరకు నంద్యాల ఆర్టీసీ డిపో డ్రైవర్లు, బాధితుడు కలిసి బుధవారం నంద్యాల ఆర్‌ఎం రజియాసుల్తానా, డీఎం గంగాధర్‌రావుకు వినతిపత్రాలు అందజేశారు.

సీబీసీఐడీతో విచారణ జరిపించాలి : నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : గతంలో పాణ్యం డిప్యూటీ తహసీల్దారుగా పనిచేసిన మల్లికార్జునరెడ్డిపై సీబీసీఐడీతో విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

అంధత్వ నివారణే లక్ష్యం : పాములపాడు, న్యూస్‌టుడే : అంధత్వ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని కంటి వైద్యుడు షేక్షావలి పేర్కొన్నారు. మండలంలోని తుమ్మలూరు జడ్పీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్నవారికి కళ్లద్దాలు అందిస్తామన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు : పాములపాడు, న్యూస్‌టుడే : సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ ఆంజనేయులు సూచించారు. జూటూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

మహిళల చదువుతోనే సమాజాభివృద్ధి : పాములపాడు, న్యూస్‌టుడే : మహిళల చదువుతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్, వయోజన విద్య పర్యవేక్షణాధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించాలని సూచించారు.

క్రీడల్లో రాణించాలి : నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎస్సై తిరుపాలు పేర్కొన్నారు. బుధవారం ఆయన వడ్డెమాను పాఠశాలను సందర్శించారు. చట్టాలపై అవగాహన కల్పించారు.

ఆన్‌లైన్‌లో అర్హుల జాబితా : నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల పొన్నాపురం కాలనీలోని శిశుగృహ, ఆళ్లగడ్డలోని బాల సదనంలో ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకుని అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపర్చినట్లు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి లీలావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల్.ఏపీ.జీవోవీ.ఇన్‌లో వివరాలు చూసుకోవాలన్నారు.

సాయిబాబాపేట.. సమస్యల తిష్ట

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పురపాలక సంఘంలో అతిపెద్ద కాలనీ అయిన సాయిబాబాపేట సమస్యల నిలయంగా మారింది. ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలు అధికంగా నివసించే ఈ కాలనీలో మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. ఖాళీ స్థలాల వల్ల తీవ్ర పారిశుద్ధ్య లోపం నెలకొంది. కుళాయిలకు కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పురపాలక :	నందికొట్కూరు
కాలనీ :	సాయిబాబాపేట
వార్డులు :	10, 13, 14, 16, 17
మొత్తం గృహాలు :	2 వేలు
జనాభా :	12 వేల మంది


ఖాళీ స్థలంలో నిలువ ఉన్న వర్షం నీరు


నీటి సరఫరా వాల్వులో నిల్వ ఉన్న నీరు, పేరుకున్న చెత్తాచెదారం

ఇళ్ల మధ్యే మురుగు కుంటలు

ఈ కాలనీలో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. గత నాలుగు నెలలుగా వీటిలో వర్షంనీరు నిలిచి మురుగుగా మారింది. దీంతో దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు అధికమయ్యాయని స్థానికులు చెబుతున్నారు. పురపాలక సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

☛ కాలనీకి సరఫరా చేస్తున్న నీరు అపరిశుభ్రంగా ఉంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాల్వు గుంతల్లో వర్షం నీరు నిలిచి చెత్త, వ్యర్థాలు పడి కుళ్లిపోయాయి. వీటి ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోందని కాలనీ వాసులు చెబుతున్నారు.

కాల్వలు అధ్వానం

కాలనీలో మురుగు కాల్వలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. గ్రామ పంచాయతీ పాలనలో ఏర్పాటు చేసిన కాల్వలు నిర్వహణ లేక పూడిపోయాయి. వర్షంపడితే నీరు రహదారులపై ప్రవహిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో కాల్వలు ధ్వంసమయ్యాయి. ఈ కాలనీలోనే పురపాలక ఛైర్మన్ నివాసం ఉంది. ఛైర్మన్ ఇంటి సమీపంలోనే ఖాళీ స్థలాలు మురుగు కుంటల్లా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి.

ద్విచక్ర వాహనాలు స్వాధీనం

మహానంది, న్యూస్‌టుడే : మహానంది మండలం గాజులపల్లె, బసవాపురంతో పాటు శిరివెళ్ల మండలం మహాదేవపురం గ్రామాల్లో చోరీకి గురైన ద్విచక్ర వాహనాలను నంద్యాల పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు నిందితులను పట్టుకొని విచారించిన వారు ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నంద్యాలకు తరలించారు. వీటిని అపహరించిన దొంగలు గాజులపల్లె ప్రాంతంలో కొందరికి రూ.13 వేల నుంచి రూ.15 వేలకే విక్రయించినట్లు సమాచారం.

చినుకు పడితే వెలుగోడే

మండల కేంద్రం వెలుగోడులో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులపై వర్షంనీరు నిలిచి వంకలను తలపించాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. వాననీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారి నంద్యాల- ఆత్మకూరు ప్రధాన రహదారి, ఆర్టీసీ బస్టాండు ఆవరణ జలమయం అవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిలవకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, వెలుగోడు




నగదు అందజేస్తున్న ఇందిరమ్మ

ప్రతి నెలా పింఛన్లు అందజేత

బనగానపల్లి, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని యువకుడికి ప్రతి నెలా సొంతంగా పింఛన్లు అందిస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి ఇందిరమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని చెరువుపల్లెకు చెందిన పుల్లమ్మ కుమారుడికి గానూ ఆమె రూ.3 వేలు ఇచ్చారు. నియోజకవర్గంలో వివిధ కులవృత్తులు చేస్తూ ప్రమాదవశాత్తు చనిపోతే తక్షణ సాయంగా రూ.లక్ష, గాయపడిన వారికి రూ.20 వేలు ఇస్తున్నట్లు తెలిపారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్యాపిలి, న్యూస్‌టుడే: 11 కేవీ చంద్రపల్లి ఫీడర్ నిర్వహణ కారణంగా హుసేనాపురం ఉపకేంద్రం పరిధిలోని చంద్రపల్లి గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్తు శాఖ ఏఈ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ఇచ్చే కరెంటు ఉదయం 4 గంటల నుంచి ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లి: 80085 73763

రుద్రవరం: **సమస్య:** మెయిన్‌బజార్, పడమటి వీధిలో పందుల సంచారం ఎక్కువగా ఉంది. -శంకర్
సమాధానం: తగిన చర్యలు తీసుకుంటాం -భాగ్యలక్ష్మి, ఎంపీడీవో, రుద్రవరం
సమస్య: నర్సాపురంలోని బీసీ కాలనీలో మురుగు రహదారిపై నిలిచి ఇబ్బందికరంగా ఉంది. -నాగేంద్ర, నరసాపురం
సమాధానం: మురుగు తొలగించే చర్యలు తీసుకుంటాం. ఇబ్బందులు లేకుండా చేస్తాం. -రామకృష్ణ, పంచాయితీ అధికారి.

పురపాలికల్లో చీకట్లు.. తీరని ఇక్కట్లు

ఆళ్లగడ్డ, డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పురపాలికల్లో చీకటి పడితే రాకపోకలు సాగించలేకపోతున్నామని నివాసితులు డోన్ పట్టణం, ఆళ్లగడ్డలలో వాపోతున్నారు. గత వైకాపా నిర్లక్ష్యం వల్ల వీధుల్లో దీపాలు లేక అవస్థల పాలవుతున్నామంటున్నారు. ఆళ్లగడ్డలో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ వీధి దీపాల సమస్యను పరిష్కరించలేమంటూ కౌన్సిల్ సాక్షిగా చేతులెత్తేశారు. 'న్యూస్‌టుడే' పరిశీలించగా నివాసితులు ఎన్నో అవస్థలు పడుతున్నట్లు తెలిసింది.


పాలసాగరం రహదారిలో చీకటి పడితే ఇదీ పరిస్థితి

ఎక్కడెక్కడ ఎలాంటి ఇబ్బందులంటే..?

☛ పట్టణంలోని శోభానగిరెడ్డి కాలనీలో దీపాలు వెలగడం లేదు. పక్కనే సమీప ప్రవాహం కారణంగా నిత్యం పాములు సంచరిస్తున్నాయని, రాత్రయితే బయటకు వెళ్లాలంటే హడలి పోతున్నామని నివాసితులు వాపోతున్నారు. రామలక్ష్మి కొట్టాలలోనూ పనిచేయకపోతే కొత్తది ఏర్పాటు చేయలేని దుస్థితి నెలకొందంటున్నారు. పాలసాగరం రహదారిలోని పలు వీధుల్లో దీపాలు కొంతమేర ఉన్నా చాలా మంది వాపోతున్నారు. సద్దాం కాలనీ, బుడగజంగాల కాలనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారిపై బట్టర్‌ఫ్లై లైట్లు వెలగడం లేదు. గాంధీ సెంటరు నుంచి బస్టాండు వరకు ప్రధాన లైట్లు వెలగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి తార్కాణంగా నిలుస్తోంది. ఎంవీనగర్‌లో సాయిబాబా ఆలయం పరిధిలో వీధి దీపాలు లేవని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు.

గుత్తేదారుతో సమస్యలు

పరిశీలన

ఆళ్లగడ్డ పురపాలక పరిధిలో 200, 70, 20 వోల్టుల దీపాలు 3800 వరకు ఉన్నాయి. వీటి నిర్వహణ ఈఈఎస్ఎల్ చూస్తోంది. ఈ సంస్థకు రూ.60 లక్షల బకాయిలు ఉండటంతో కొత్తగా ఏర్పడిన కౌన్సిల్ ఈ మొత్తాన్ని చెల్లించేందుకు నిరాకరించింది. దీంతో వారు కొత్త వీధి దీపాలు పంపలేదు. పురపాలక నిధులతోనే కొత్తవి కొనుగోలు చేస్తున్నారు. ఈ మధ్యనే కొన్ని దీపాలను కొనుగోలు చేశారు. ఈఈఎస్ఎల్‌కు బకాయిలను పూర్తిగా చెల్లించాలని అధికారులు నిర్ణయించారు.

బకాయిల బెడద..తీరని వ్యథ

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: డోన్ పట్టణంలో వీధి దీపాలు నోచుకోని స్తంభాలు ఉన్నాయి. వైఎస్‌ఆర్ నగర్, శ్రీనివాసనగర్‌లో విద్యుత్తు స్తంభాలు ఉన్నా..దీపాలకు నోచుకోవడం లేదు. కొత్త ఇందిరానగర్‌లోని ఓ వీధిలో విద్యుత్తు స్తంభాలకు నోచుకోక నివాసితులు భయాందోళన చెందుతున్నారు. పట్టణంలోని ఉపరితల వంతెనకు ఇరువైపులా దీపాలు కాలిపోవడంతో రాత్రి సమయంలో చీకటిగా ఉంటుండటంతో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. టీచర్స్‌కాలనీలో మల్లా స్ట్రీట్‌లో పిల్లల నుంచి పెద్దల వరకు బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. పలు మార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలో దీపాల మరమ్మతులకు రూ. 5లక్షలు ప్రతిపాదించారు. దీనిపై కౌన్సిల్ ఆమోదం పొందింది. విద్యుత్తు సామగ్రి తెప్పించేందుకు టెండరు దారుడికి వర్క్ ఆర్డర్ ఇచ్చినా నేటికీ పరికరాలు రాకపోవడం గమనార్హం.

గత ప్రభుత్వ నిర్వాకంతో...

2015 జూన్ నుంచి ఈఈఎస్ఎల్ కంపెనీ వీధి దీపాల నిర్వహణ పర్యవేక్షించేది. ఏడాదికి రూ. 40 లక్షలు ఈఈఎస్ఎల్ కంపెనీకి చెల్లిస్తుండగా, ఇప్పటివరకు కంపెనీ వారికి రూ. 1,25,13,000 బకాయిలున్నట్లు అధికారులు చెబుతున్నారు. కంపెనీ వారి ఏడేళ్ల వరకు ఇచ్చిన గడువు 2023 జులైతో ముగిసింది. అయినా కంపెనీకి బకాయిలు చెల్లించలేదు.

పట్టణం: డోన్, వార్డులు: 32, గృహాలు: 18,087
జనాభా: 75వేలకు పైగా, వీధి దీపాలు: 4,937


డోన్ ఉపరితల వంతెన వద్ద అంధకారంలో ఓ వీధి

ప్రతి ఒక్కరికీ పనులు కల్పించండి

బేతంచెర్ల,న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తావివ్వకుండా జాబ్‌కార్డు కలిగిన అందరికీ పనులు కల్పించాలని డ్వామా పీడీ జనార్దన్‌రావు,


వివరాలు అడుగుతున్న డ్వామా పీడీ

ఏపీడీ బాలజీనాయక్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, ఎంపీడీవో ఫజల్ రహిమాన్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు.

ప్రతి విద్యార్థికి అపార్ నమోదు తప్పనిసరి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్ అందించేందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని విజయవాడ నుంచి విద్యా కమిషనర్ వెబ్ మీటింగ్ ద్వారా సూచించినట్లు మండల విద్యాధికారులు ప్రభాకర్, రామనర్సప్ప తెలిపారు. బుధవారం స్థానిక కొత్తపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వెబ్ సమావేశం నిర్వహించారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

ప్యాపిలి, న్యూస్‌టుడే: రైతుల సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఉప తహసీల్దార్ మధుసూదన్ పేర్కొన్నారు. బుధవారం మాధవరంలో భూసమస్యల పరిష్కారం కోసం గ్రామసభను నిర్వహించారు.

బాచేపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం): బాచేపల్లెలో రెవెన్యూ అధికారులు బుధవారం గ్రామ సభ నిర్వహించారు. పొలాల సర్వేలో నెలకొన్న సమస్యలపై రైతులతో మాట్లాడారు.

కంపమల్ల(కోవెలకుంట్ల గ్రామీణం), న్యూస్‌టుడే: రీ-సర్వేలో వెల్లడైన భూసమస్యల పరిష్కారానికి గానూ కంపమల్లలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. 26 వినతులు వచ్చాయని అధికారులు తెలిపారు.

సంజామల: ఎగ్గోనిలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో భూ సమస్యల్ని పరిష్కరించాలని పలువురు దరఖాస్తులు అందించారు.

గుండుపాపల(దొర్నిపాడు): గుండుపాపలలో తహసీల్దార్ సుభద్ర ఆధ్వర్యంలో రీసర్వే సందర్భంగా సభ నిర్వహించారు.

కొత్తబురుజు(డోన్), న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేతో పొలాల్లో తమ విస్తీర్ణంలో తేడాలు వచ్చాయని ఇలాగైతే తమకు ఏం న్యాయం జరిగినట్లు అని రైతులు డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం మండలంలోని కొత్తబురుజు గ్రామంలో రీసర్వేపై గ్రామసభలు నిర్వహించారు.

చెన్నంపల్లె(అవుకు): భూముల వివరాలు పట్టాదారు పాసుపుస్తకాల్లో ఎందుకు నమోదు కాలేదని చెన్నంపల్లెకు చెందిన రైతులు అధికారులను ప్రశ్నించారు. బుధవారం చెన్నంపల్లెలో అధికారులు సమావేశం నిర్వహించారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో మెలగాలని సీఐ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గంజాయి, సైబర్ నేరాలు, ర్యాగింగ్, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ఉయ్యాలవాడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు.

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: అత్యాధునిక కూరగాయల మార్కెట్ లోపల నిర్మించిన దుకాణాలు అద్దెలు తగ్గించాలని కోరుతూ దుకాణాదారులు బుధవారం స్థానిక పుర కార్యాలయంలో ఛైర్మన్ సప్తశైల రాజేష్‌కు వినతిపత్రాన్ని అందించారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: పాఠశాలల అభివృద్ధికి పిల్లల తల్లిదండ్రులను భాగస్వాముల్ని చేయాలని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ విజయరాజు అన్నారు. ఉయ్యాలవాడ ఆదర్శ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన టెలికాన్ఫరెన్స్‌లో మండల విద్యాశాఖాధికారి వీర ప్రతాపురెడ్డి, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

డోన్, న్యూస్‌టుడే: మల్యాల, లింగనేనిదొడ్డి మధ్యలో వారంరోజులక్రితం ఓ వ్యక్తి మృతి చెందారని డోన్ రైల్వేపోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన తరపు ఎవరూ లేకపోవడంతో ద్రోణాచలసేవా సమితిసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఖర్చును దాత చరణ్‌తేజరెడ్డి అందించారన్నారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణంలో రెండు ఘటనల్లో దస్తగిరి, గురువయ్యలను అరెస్టు చేసి 45 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు కేసులను ఎస్సైలు జయప్ప, నగీనా నమోదు చేశారు.

డోన్, న్యూస్‌టుడే: పట్టణంలోని పాతబస్టాండ్ సీఎస్ఐ చర్చి తొమ్మిదో వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించినట్లు పాస్టర్ శామ్యూల్ ల్యాబర్టు తెలిపారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యదర్శి మరియదాస్, ట్రెజరర్ విజయరాణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని అనంత డిగ్రీ కళాశాలలో ఎస్‌బీఈఈపీ యాక్టివిటీలో భాగంగా యువతకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్వీప్ (ఎస్‌వీఈఈపీ) నోడల్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ శ్రీకాంతరెడ్డి బుధవారం కలిశారు. త్వరలోనే ఆళ్లగడ్డలో ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: అన్నదానం మహోన్నత సేవని ఆళ్లగడ్డ తెదేపా నేత భార్గవ్ రామ్ నాయుడు అన్నారు. బుధవారం పట్టణ శివార్లలోని కాశింతల క్షేత్ర పరిధిలో అన్న ప్రసాద సంతర్పణశాలను ప్రారంభించారు.

మెరుగైన సేవలు అందించండి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి డిపోను లాభాల బాటలో నడిపించాలని జిల్లా ప్రజా రవాణాధికారి రజియా సుల్తానా సూచించారు. కోవెలకుంట్లలోని ఆర్టీసీ డిపోను ఆమె బుధవారం తనిఖీ చేసి మాట్లాడారు.


బస్టాండ్‌ను పరిశీలిస్తున్న రజియా


ప్రతిభకు గుర్తింపు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి మేధస్సుకు పదును పెడితే ప్రతిభను చాటుకోగలరని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ ఉమారెడ్డి పేర్కొన్నారు. బుధవారం శ్రీ చైతన్య ఆంగ్లమాధ్యమ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎం.లిఖిత (8వ తరగతి), జాహ్నవి (9వ తరగతి), జె.వనజలక్ష్మీ (పదో తరగతి)లకు ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ సువర్ణాదేవి, డీన్‌లు బి.మద్దిలేటి, బి.రంగడు, ఉపాధ్యాయినులు హరిత, శిరీష ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.


విద్యార్థులకు ధ్రువపత్రాలు, బహుమతులు అందిస్తున్న పాఠశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాళ్లు

రాకపోకలు సాగించేదెలా?



బేతంచెర్ల మండలం పెండేకల్లు అడ్డురోడ్డు నుంచి బాలాపురం-రేపల్లె రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో వాహనాల రాకపోకలకు ఆటంకాలు కలుగుతున్నాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయిదేళ్లుగా ముళ్లపొదలను తొలగించకపోవడంతో వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి నాగప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా ముళ్ల పొదలు తొలగించే విధంగా చూస్తామన్నారు. -న్యూస్‌టుడే, పెండేకల్లు(బేతంచెర్ల)


వివరాలు తెలుసుకుంటున్న లీలా వెంకటశేషాద్రి

ప్రశాంత జీవనం అలవర్చుకోవాలి

డోన్, న్యూస్‌టుడే: నేరాల బాట పట్టకుండా ప్రశాంతజీవనాన్ని అంతా అలవర్చుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. జైలులో ఖైదీలకు అందుతున్న వసతులు పరిశీలించారు. భోజన సౌకర్యం ఎలా ఉంది, ఏదైనా అనారోగ్య సమస్య వస్తే వైద్యులు అందుబాటులోకి వస్తున్నారా..? లేదా..? అనే విషయాలను తెలుసుకున్నారు. జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, జైలు సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సంజామల, న్యూస్‌టుడే: కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో పేరుసోముల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయిని సీతారావమ్మ చెప్పారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన సమావేశంలో ఆమె విద్యార్థినులను అభినందించారు. సీనియర్ ఉపాధ్యాయులు మేడా హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయిని సీతారావమ్మ

సైక్లింగ్ పోటీలకు..

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు వీరరాఘవయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న కర్నూలు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీల్లో ఎం.అనిత, కె.మాలిక్ అండర్-17 విభాగంలో ఉత్తమ ప్రతిభ చూపించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.


సైక్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్.ఎం.

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు కోటయ్య తెలిపారు. పదోతరగతి విద్యార్థులు పండు, మనీషా, సమీరా అండర్-17 హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు, హరినారపుసింహ, సునీత అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలకు, అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీలకు నవ్యశ్రీ, షాహీద్ ఎంపికయ్యారని వారిని అభినందించారు.

గుండాలపై చెరువుకు ఎట్టకేలకు నీరు

గుండాల(డోన్), న్యూస్‌టుడే: 77 చెరువుల్ని నింపడంలో భాగంగా రెండేళ్లు గడుస్తున్నా ఇంకా ట్రయల్‌రన్ జరుగుతోంది. బుధవారం గుండాలలోని చెరువుకు హంద్రీనీవా కాల్వ ద్వారా పైపులైన్ పనులు పూర్తి కావడంతో ట్రయల్‌రన్ కింద నీటిని వదిలారు. వదిలిన కొద్ది సేపటికే చను గొండ్ల సమీపంలోని ప్రాంతంలో పైపులైన్‌లీకేజి అవుతుందని బంద్ చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.


హంద్రీనీవా కాల్వ నుంచి వదిలిన నీరు

పంట పొలాల పరిశీలన

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అడ్డవాగు పొంగి పాత గోపల్లె రస్తాలోని పంట పొలాలు నీట మునిగాయి. మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ బుధవారం పంట పొలాలను పరిశీలించారు. పంటలు పూర్తిగా పాడయ్యాయని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు మొరపెట్టుకున్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని సీనియర్ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మావతమ్మ ఆధ్వర్యంలో ఇన్‌ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ ఒకేషనల్ కోర్సు విద్యార్థులు స్థానిక ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్‌ను బుధవారం సందర్శించారు.


ఇండస్ట్రియల్ విజిట్‌కు బయల్దేరిన విద్యార్థులు

బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. బుధవారం అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న ముగ్గురికి ఆమె చెక్కులను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజా సమస్యల పరిష్కారమే తెదేపా ప్రధాన ధ్యేయమని నియోజకవర్గ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక బుధవారం నిర్వహించారు. తెదేపా మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, సూరా రామ, యామా గురప్ప, ఫిదాహుసేన్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పై నుంచి సిమెంట్ పెచ్చు లూడి పడటంతో గాయపడిన విద్యార్థిని శ్వేతను బుధవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత గదుల్లో తరగతుల నిర్వహణతోనే ఈ ఘటన జరిగిందని తాను భావిస్తున్నానని, కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి నిధులను మంజూరు చేయించి కొత్త తరగతి గదుల నిర్మాణం చేపడతామన్నారు.

పల్లె కబుర్లు

బాచేపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం): బాచేపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయంలో తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం భగవద్గీత, రామాయణంలోని ప్రవచనాలను అవధాని కవిరాజు గంగుల నాగరాజు భక్తులకు వివరించారు.

కూలూరు(చాగలమర్రి): చాగలమర్రి పట్టణం గుండా సాగే 40వ జాతీయ రహదారి కూలూరు రస్తాలో ప్రమాదవశాత్తు బుధవారం లారీ బోల్తా పడింది. డ్రైవర్ మురుగన్‌కు స్వల్పగాయాలయ్యాయి. టోల్‌ప్లాజా సిబ్బంది అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

పసుపల(బనగానపల్లి గ్రామీణం): పసుపల ఉన్నతపాఠశాల ప్రాంగణంలో ఏపీజీబీ గార్లదిన్నె బ్రాంచి మేనేజరు మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

పెద్దయమ్మనూరు(ఉయ్యాలవాడ): మిరప పంటలో సమగ్ర సస్యరక్షణ అవసరమని ఆత్మ విభాగం వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ అన్నారు. పెద్దయమ్మనూరు, బోడెమ్మనూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది చేపట్టారు.

రేవనూరు(కోవెలకుంట్ల గ్రామీణం): రేవనూరులో ఉద్యానశాఖ అధికారిణి ధరణి ఆధ్వర్యంలో మిరప రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

బిజనవేముల(కోవెలకుంట్ల గ్రామీణం): బిజనవేములలో గురువారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. రీ-సర్వేలో భూ సమస్యలు ఉంటే తెలియజేయాలనానరు.

గార్లదిన్నె(ప్యాపిలి), న్యూస్‌టుడే: గార్లదిన్నెలో జలదుర్గం ఎస్సై నాగార్జున ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

కాలనీళ్లు.. అవస్థలకు నిలయాలు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో సదుపాయాల్లేక నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 5,810 కుటుంబాలు ఉండగా 23,859 మంది జనాభా నివసిస్తోంది. 20 వార్డులు ఉండగా..గతం కంటే ఎక్కువ కాలనీలు ఏర్పాటయ్యాయి. జనాభా పెరగడంతో విస్తరించిన కాలనీలల్లో వసతులు లేక నివాసితులు ఇబ్బందులుపడుతున్నారు. రహదారులు, మురుగు కాల్వలు లేకపోవడంతో వర్షాలు కురిస్తే రోడ్లన్నీ బురదగా మారి ఎక్కడికక్కడే నీరు నిలుస్తోంది. జనాలు రోగాల బారిన పడి అల్లాడుతున్నామని చెబుతున్నారు.

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే...?

★ సుంకులమ్మ గుడి నుంచి సయ్యద్ మసీదుకు వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభం దగ్గర వీధిలో సీసీ రహదారి లేదు. మట్టిదారి ఉండటంతో వర్షపునీరంతా నిలిచి దారంతా బురదగా మారుతోంది. దీనిపక్కనే కుడివైపున కాలువ నిర్మించి సీసీ రోడ్డు నిర్మించకపోవడంతో ముళ్లపొదలతో నిండిపోయింది. రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని నివాసితులు చెబుతున్నారు. సరైన కాల్వలు లేకపోవడంతో సయ్యద్ మసీదు పక్కనే మురుగు నిల్వ ఉండి కుంటలా మారడంతో స్థానికులు దోమల బెడదతో అల్లాడుతున్నారు.

★ సుంకులమ్మ గుడి ఎదురుగా ఉన్న కాలనీలో మురుగు నిలుస్తుండటంతో దోమలు ఎక్కువవుతున్నాయని, దుర్వాసనతో అల్లాడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ సీసీ రోడ్డు, కాలువ లేకపోవడంతో సమస్య తీవ్రంగా మారిందంటున్నారు. మురుగు నిలిచి అస్తవ్యస్తంగా మారడంతో జ్వరాల బారిన పడుతున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. కాల్వల్లోని మురుగు పారక అవస్థలపాలవుతున్నామని నివాసితులు చెబుతున్నారు. సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నాయని, పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని నివాసితులు చెబుతున్నారు.


కాలనీలో నిలిచిన మురుగు

★ గాంధీనగర్ కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయం దగ్గర వీధిలో సీసీ రహదారి, మురుగు కాల్వలు లేక వర్షాలు కురిసినప్పుడు ఇబ్బందుల పాలవుతున్నామని స్థానికులు చెబుతున్నారు, సీతారామనగర్, ఆటోనగర్ కాలనీల్లోనూ సీసీ రహదారులు, మురుగు కాల్వల సమస్య నెలకొందంటున్నారు.

★ ఇందిరమ్మ కాలనీలో సుమారు 500 కుటుంబాల వరకు ఉన్నాయి. ఇక్కడ సీసీ రహదారులు, మురుగు కాల్వల సమస్య వేధిస్తోంది. దారులన్నీ మట్టివి కావడంతో వర్షానికి బురదగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దోమల బెడద ఎక్కువని చెబుతున్నారు.

★ స్వామినగర్ కాలనీలోని కోళ్లఫారం వీధిలోనూ సుమారు 200కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ కాల్వలు లేక వర్షాలుకురిసినప్పుడు నీరు ఇళ్ల మధ్యలోనే నిలిచి అల్లాడుతున్నారు.


సుంకులమ్మ గుడి వెనకాల వీధిలో కాలువ నిర్మించి రోడ్డు వేయని దారి

రోగాలబారిన పడుతున్నాం
-చాకలి బాలరాజు, సుంకులమ్మ గుడి వీధి

మా వీధిలో ఎంతోకాలం నుంచి మురుగు కాల్వలు, రోడ్లు లేకపోవడంతో ఇళ్ళ ముందే వ్యర్థాలు ఉంటున్నాయి. వర్షాలకు మురుగు ఇంట్లోకి వస్తోంది. దుర్వాసన, దోమల బెడద ఎక్కువై రోగాలతో అల్లాడుతున్నాం. రోడ్డు కొంతవరకు నిర్మించి వదిలేయడంతో దారిలో వెళ్లే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యలను గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు.

సమస్యలు పరిష్కరిస్తాం
- ప్రకాష్‌నాయుడు, ఈవోఆర్డీ

గతంలో నిధులు లేకపోవడంతో సమస్యలు నెలకొన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం ఉపాధి, ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తుండటంతో సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంది. ఇప్పటికే రూ.70 లక్షలు రావడంతో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలకు చర్యలు చేపట్టాం. మళ్లీ నిధులు రాగానే సమస్యల్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం